సాక్షి
వికారాబాద్
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



కైవసం చేసుకుంటాం..

స్థానిక ఎన్నికల్లో జెడ్పీ పీఠాన్ని కై వసం చేసుకుంటామని బీజేపీ ఎన్నికల జిల్లా కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా అన్నారు. 8లో▸



క్రీడలతోనే ఆరోగ్యం

క్రీడలు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. 8లో▸



అంతా కొత్తే..!

స్థానిక ఎన్నికల కోలాహలం మొదలైంది. రేసులో ఉండబోయే ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

యువతకు ప్రాధాన్యమివ్వండి

పరిగి పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్



రాంచందర్‌రావును సన్మానిస్తున్న రాఘవేందర్ గౌడ్

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యమివ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పరిగి పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ కోరారు. ఆదివారం ఆయన నగరంలోని రాంచందర్‌నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతి కోసం స్థానిక నాయకత్వానికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ సందర్భంగా రాచందర్‌రావును ఆయన ఘనంగా సన్మానించారు.

బీఆర్‌ఎస్ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా కిశోర్



కిశోర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ఆనంద్

అనంతగిరి: బీఆర్‌ఎస్ బీసీ సెల్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా కిశోర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికపుడు స్పందించి ఉద్యమిస్తామన్నారు. కాంగ్రెస్ మోసాలను ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున్, సురేశ్, సుభాన్‌రెడ్డి, ముర్తుజా అలీ, మల్లేశ్, రమణ, వేణుగోపాల్, అనంత్‌రెడ్డి, ఫరీద్, నరసింహ, వరుణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



షాద్‌నగర్: దసరా సెలవులు ముగిసాయి.. పండుగకు స్వగ్రామాలకు వచ్చిన వారంతా పట్నానికి తిరుగు పయనం అయ్యారు. ఫలితంగా హైదరాబాద్ – బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు క్యూ కట్టాయి. షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద బారులు తీరి కనిపించాయి. వాహనదారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా టోల్‌సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.

దుకాణాల కూల్చివేత దారుణం



ఆందోళన చేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: పెద్దలను వదిలి పేదలు, చిరు వ్యాపారులపై చర్యలు తీసుకోవడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ అన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆదివారం మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల గుడిసెలను తొలగించి, వారిని ఉపాధికి దూరం చేశారని ఆరోపించారు. ఏళ్లుగా రోడ్డుకు ఇరువైపులా చిన్న చిన్న గుడిసెలను వేసుకుని, మధ్యాహ్న భోజనం, పండ్లను విక్రయిస్తున్నారని, అలాంటి వారికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేశారని విమర్శించారు. రోజువారీ అప్పులు చెల్లిస్తూ, ఉపాధి పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఈ.నరసింహ, సీహెచ్ ఎల్లేశ్, సత్యనారాయణ, యాదయ్య పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు



అనంతగిరి: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

అనంతగిరి: వికారాబాద్ మండలంలో ఆదివారం తెల్లవారుజామునుంచే భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పలు చోట్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు గ్రామాల్లో వరదనీరు గ్రామాల్లో ప్రధాన రోడ్ల వెంట ఉధృతిగా ప్రవహించాయి.

ఉధృతంగా కోకట్ కాగ్నా



కోకట్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న కాగ్నా

యాలాల: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండలంతో పాటు ఎగువ మండలాల్లోనూ భారీ వర్షం కారణంగా కోకట్ కాగ్నా నది ఉప్పొంగింది. దీంతో తాండూరు–రాస్నం మార్గంలో రాకపోకలు నిలిచాయి. కాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాగ్నా ఉప్పొంగి ప్రవహించడంతో కోకట్ బ్రిడ్జి తెగింది. నాపరాతి ముక్కలు, మొరంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారు.



అనంతగిరి: పీలారంలో ఇంట్లోకి చేరిన వరద నీరు

వాన.. హైరానా

శనివారం అర్ధరాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగిపొర్లాయి. కర్ణాటక సరిహద్దు నుంచి రాకపోకలు స్తంభించాయి. కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు ఉధృతంగా ప్రవహించి పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల ఇళ్లలోకి నీరు చేరగా.. కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

– వికారాబాద్ నెట్‌వర్క్

70.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

- పొంగిన వాగులు, వంకలు
- ఉగ్రరూపం దాల్చిన కోట్‌పల్లి ప్రాజెక్టు
- నీట మునిగిన పంటలు
- నిలిచిన రాకపోకలు



బంట్వారం: ఉధృతంగా ప్రవహిస్తున్న కంకణాలపల్లి వాగు

నిర్లక్ష్యంతో జనం ఇబ్బంది

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ఆదివారం తెల్లవారుజామునుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు వరదతో పోటెత్తాయి. కంకణాలపల్లి వాగు ఉధృతంగా ప్రవహించింది. సల్బత్తాపూర్‌లో గుట్టపై నుంచి పారిన వరద ఇళ్లలోకి చేరింది. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

ఆర్అండ్‌బీ అధికారుల తప్పిదంతో వర్షం కురిసిన ప్రతీసారి వరద నీరు ఇళ్లలోకి చేరుతుందని సల్బత్తాపూర్ కాలనీ వాసులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వేసే సమయంలో ఇరువైపులా కాల్వలు తవ్వని కాంట్రాక్టర్ అలాగే వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడేళ్లుగా వర్షం పడిన ప్రతీసారి తమకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. లేదంటే వికారాబాద్ ఆర్అండ్‌బీ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.



బంట్వారం: సల్బత్తాపూర్‌లో గుట్టమీదుగా కాలనీలోకి వరద ప్రవాహం



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న ధర్మాపూర్ వాగు

పోటెత్తిన వరద

ధారూరు: మండల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగులు పడిన శబ్దంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన కుంభవృష్టికి కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి అలుగు ద్వారా వరదనీరు పోటెత్తి ప్రవహించింది. దీంతో రుద్రారం –నాగసమందర్ గ్రామాల మధ్యన రోడ్డు అలుగునీటి ప్రవాహానికి కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. ధర్మాపూర్–కొండాపూర్‌కలాన్, నాగారం–మైలారం మధ్య రోడ్లపై నుంచి వాగులు ప్రవహించి సమీప పంట పొలాలను దెబ్బతీసాయి.

ఆరు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



బషీరాబాద్: కల్వర్టు పై నుంచి వరద ప్రవాహం, నిలిచిన రాకపోకలు

బషీరాబాద్: కారు మబ్బులతో మేఘం ఘర్జించింది. ఆదివారం తెల్లవారుజామున భీకర ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం జనాన్ని వణికించింది. ఉదయం 3 గంటలకు ప్రారంభమైన జడివాన మధ్యాహ్నం 12 గంటల వరకు దంచి కొట్టింది. ఏడు సెంటీమీటర్ల పైన కురిసిన భారీ వర్షానికి మండలంలోని చెరువులు, కుంటలు మత్తడి దూకాయి. కాగ్నానది, జుంటివాగు, ఎక్మాయి వాగు, వంకలు పొంగిపొర్లాయి. మండల కేంద్రంలోని టాకీతండా దగ్గర కాల్వ కల్వర్టుపై నుంచి పొంగి పొర్లడంతో, బషీరాబాద్ నుంచి మంతన్‌గౌడ్ తండా, మంతన్ గౌడ్, ఎక్మాయి, మైల్వార్, కంసాన్‌పల్లితో పాటు కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగ్నానది వరదకు మరోసారి పంటలు నీట మునిగాయి. బషీరాబాద్‌లో ఓ పాడుపడిన ఇల్లు పాక్షికంగా కూలింది.

పంటలు వర్షార్పణం



తాండూరు రూరల్: ఐనెల్లిలో తడిసిన సోయాబీన్ పంటను చూపుతున్న రైతులు

తాండూరు రూరల్: వర్షాకాలం ముగింపునకు చేరినా వర్షాలు ఆగడం లేదు. ఇప్పటికే వరుణుడి ప్రతాపానికి పంటలు పాడయ్యాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు కురిసిన వర్షాలకు తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో కోత్లాపూర్ వాగు పొంగి పొర్లింది. దీంతో ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంగెంకలాన్ శివారులోని వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఐనెల్లిలో ఆరబెట్టిన సోయాబీన్ వర్షానికి తడిసిపోయింది. పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఇందూర్‌లో ఇళ్లల్లోకి వరద..

పెద్దేముల్ మండల పరిధిలోని గ్రామాల్లో రుద్రారం వాగు పొంగిపొర్లింది. ఇందూర్ గ్రామంలో ఇళ్లలోకి వరద చేరింది. దీంతో నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సన్నాలకు బోనస్ సున్నా



కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం(ఫైల్)

- ఐదు నెలలు గడుస్తున్నా అందని ప్రభుత్వ ప్రోత్సాహకం
- 8 వేల మెట్రిక్ టన్నులకు గాను రూ.4 కోట్ల బకాయి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

పరిగి: వరిలో సన్నరకం పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ అదనంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా రైతులు సన్నాల సాగు చేపట్టారు. వీటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ధాన్యం కొనుగోలు చేసి ఐదు నెలలు కావస్తున్న బోనస్ డబ్బులు మాత్రం నేటికీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 8 వేల మెట్రిక్ టన్నుల సన్నాలు సేకరించగా ఇందుకు సంబంధించి దాదాపు రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. బోనస్ ఎప్పుడు పడుతుందోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఒక్కో రైతుకు రూ.లక్ష వరకు..

మే మొదటి వారంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. సన్న రకం విక్రయించిన రైతులకు ముందుగా క్వింటాల్‌కు రూ.2,320 చెల్లించి తరువాత బోనస్ వేస్తామని ప్రకటించింది. ధాన్యం అసలు ధర రైతుల ఖాతాల్లో వెంటనే జమచేసినా బోనస్ మాత్రం వేయలేదు. ఒక్కో రైతుకు లక్ష వరకు రావాల్సి ఉంది. వానాకాలం ధాన్యం విక్రయాల సమయమొచ్చినా నేటికీ బోనస్ చెల్లించకపోవడం సరికాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

65 క్వింటాళ్లకు రావాలి



యాసంగిలో ఐదెకరాల్లో సన్న రకం సాగు చేసా. ఈ ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించిన. 65 క్వింటాళ్ల సన్న రకం వరి ధాన్యం విక్రయించి ఐదు నెలలు అవుతుంది. బోనస్ డబ్బులే రూ.32వేలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం అందించలేదు. వెంటనే బోనస్ జమచేయాలి.

– మేకల శ్రీనివాస్, ఐనాపూర్, దోమ

నిర్లక్ష్యం సరికాదు



బోనస్ ప్రకటించిన ప్రకారం రైతులకు వెంటనే అందజేయాలి. దాదాపు ఐదు నెలలుగా గడుస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదు. మళ్లీ వరి కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వంపై రైతుల పక్షాన వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేస్తుంది. మరింత ఆలస్యం చేస్తే నిరసన కార్యక్రమాలు చేపడతాం.

– వెంకటయ్య, జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

వరుసపెట్టి.. ఆరు కార్లు ఢీకొట్టి

- ఓఆర్ఆర్‌పై ప్రమాదం
- ఇద్దరికి స్వల్ప గాయాలు



ఒకదానికొకటి ఢీకొన్న కార్లు

రాజేంద్రనగర్: ఓఆర్ఆర్‌పై వెళ్తున్న ఓ కారు వేగం ఒక్కసారిగా నెమ్మదించడంతో వెనుక వస్తున్న మరో ఐదు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరు కార్లు ధ్వంసం కాగా.. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నానికి చెందిన గంగాధర్ ఆదివారం ఓఆర్ఆర్‌పై శంషాబాద్ మీదుగా గచ్చిబౌలి వైపు కారులో వెళ్తున్నాడు. హిమాయత్‌సాగర్ ప్రాంతంలోకి రాగానే కారు వేగాన్ని ఒక్కసారిగా తగ్గించాడు. దీంతో వెనకాలే వస్తున్న మరో ఐదు కార్లు ఒకదానికొకటి ఢీకొంటూ గంగాధర్ వాహనాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఆరు వాహనాలు ఒకదాని వెనుక ఒకటి ఢీకొనడంతో ధ్వంసమయ్యాయి. గంగాధర్‌తో పాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ధ్వంసమైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాదేశిక పోరు.. ఎవరిదో జోరు!

- గత ఎన్నికల్లో సత్తాచాటిన 'కారు'
- జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు బీఆర్‌ఎస్ ఖాతాలోకే..
- హస్తగతం చేసుకునేందుకు పావులు కదుపుతున్న కాంగ్రెస్



దౌల్తాబాద్: పల్లెల్లో ఎన్నికల సందడి ప్రారంభమైంది. మండలంలో తొలివిడతలో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సమాయత్తమవుతుండగా ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. గత ప్రాదేశిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కై వసం చేసుకుంది. 15 ఎంపీటీసీ స్థానాల్లో ఒకటి కాంగ్రెస్ గెలుపొందగా.. 14 స్థానాల్లో కారు జోరు చూపింది. నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడంతో మండల పరిధిలో అన్ని స్థానాలు హస్తగతం చేసుకునేందుకు పార్టీ శ్రేణులు వ్యూహం రచిస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని వివరించాలంటూ సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. ఇక్కడి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వ్యూహం ఎలా ఉండనుంది అనేది ఆసక్తికరంగా మారింది.

ఆశావహుల్లో ఉత్కంఠ

ఎన్నికల సంఘం స్థానికల సంస్థల ఎన్నికల ప్రకటన విడుదలచేయడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో పార్టీల తరఫున ఎవరెవరు పోటీ చేయాలనే దానిపై నేతలు మంతనాలు మొదలుపెట్టారు. రిజర్వేషన్లు మారడంతో ఈ సారి కొత్త ముఖాలు రాజకీయాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి.

పార్టీ గుర్తుపై పోటీకి..

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పార్టీ గుర్తులతోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి బరిలో నిలిచేందుకు పలువురు నేతలు టికెట్ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గెలుపు ధీమాతో ఉన్న నాయకులు పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి తిరుపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి సూచించిన వ్యక్తులకే టికెట్ ఇవ్వనున్నారు.

బరిలో మాజీలు..?

గత సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచిన, ఓడిన అభ్యర్థులు ప్రాదేశిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోసారి తమ జాతకం పరీక్షించుకోవాలనే ఉద్దేశంతో ఖర్చుకు వెనుకాడకుండా గ్రామ స్థాయి నుంచి నాయకులు కార్యకర్తలతో సమాలోచనలు జరుపుతున్నారు. జనరల్ స్థానాల్లో తీవ్ర పోటీ ఉంది.

మూసీలోకి భారీ వరద

జంట జలాశయాల పది గేట్లు ఎత్తివేత

సాక్షి, సిటీబ్యూరో/మణికొండ: మూసీలోకి వరద ప్రవాహం పెరిగింది. జంట జలాశయాల 10 గేట్లు 3 అడుగుల చొప్పున ఎత్తి దిగువకు సుమారు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో వరద ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు ప్రవాహం పెరిగింది. ఇప్పటికే రెండు రిజర్వాయర్ల పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నీరు చేరడంతో ఆదివారం ఎగువ నుంచి వచ్చిన వరదను దిగువకు విడుదల చేశారు. దీంతో దిగువ ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. ఉస్మాన్ సాగర్ (గండిపేట) 8 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి మూసీ నదికి 2,704 క్యూసెక్కుల వరద నీటిని వదిలారు. దీంతో నార్సింగి, హైదర్షాకోట్, మంచిరేవుల నుంచి మూసీ నది పొంగి ప్రవహిస్తోంది. హిమాయత్ సాగర్‌కు పైనుంచి 1,600 క్యూసెక్కుల వరద వస్తుండటంతో రెండు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 1,981 క్యూసెక్కుల నీటిని ఈసీ నదికి వదిలారు. లంగర్‌హౌస్‌లో మూసీ నదిలో కలవటంతో అక్కడి నుంచి మరింత ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. గండిపేట నుంచి 8 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండటంతో నార్సింగి మున్సిపల్ కేంద్రం నుంచి మంచిరేవులకు, ఔటర్ ఓ వైపు సర్వీసు రోడ్ల మీదుగా నీరు పారడంతో రాకపోకలను నిలిపివేశారు. పరీవాహక ప్రాంతం నుంచి వచ్చే వరదను బట్టి మరిన్ని గేట్లను తెరవటం, మూయటం చేస్తామని మూసీ నది పరీవాహకంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి, రెవెన్యూ, పోలీసు అధికారులు సూచించారు. జలాశయాల నీటి విడుదలతో స్థానికులు కొందరు గాలాలతో చేపలు పడుతూ కనిపించారు.



క్లుప్తంగా

స్థానిక పోరులో యువత పోటీ చేయాలి

మర్పల్లి: త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు యువత పెద్ద ఎత్తున పోటీ చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిపురం రవికుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో యువత విజయం సాధించి.. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా ఉద్యమించాలని పేర్కొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ


భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు

తాండూరు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాండూరు పట్టణం నుంచి మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో వెలిసిన భవాని మాత దర్శనానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాద వితరణ చేశారు. పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకాలు రాకూడదని సమితి సభ్యులు అమ్మవారికి కోరుకున్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు, సభ్యులు రామకృష్ణ, కుమార్, లోకేష్, రమేష్, అశోక్, వెంకట్, పరమేష్, రాజు, నరేష్ పాల్గొన్నారు.

లగచర్లవాసికి సాహితీ కళా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రమేశ్

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్లకు చెందిన ఈర్లపల్లి రమేశ్‌కు సాహితీ కళా పురస్కారం వరించింది. 2025కు గాను దసరా, బతుకమ్మ వేడుకల సందర్భంగా నగరంలోని రవీంద్ర భారతిలో ఇటీవల వివిధ రంగాల్లోని కళాకారులకు పురస్కారాలు అందించారు. నిత్యశ్రీ యూట్యూబ్ చానల్ ద్వారా పాటలను, షార్ట్ ఫిల్మ్‌లను అందిస్తూ గుర్తింపు తెచ్చుకున్న రమేశ్‌కు సాహితీ కళా పురస్కారాన్ని అందజేశారు. ఈ మేరకు ఆదివారం గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

సంజీవ్‌రెడ్డిని విడుదల చేయాలి


పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామానికి చెందిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాళ్ల సంజీవ్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో సంజీవ్‌రెడ్డితో పాటు యువకులను పరామర్శించారు. ఈ సందర్భంగా అక్రమంగా కేసులు పెట్టి జైలుకు తరలిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం సీఐ నగేష్‌ను కలిసి కేసు వివరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దేశానికి పూర్వ వైభవం తెస్తాం

ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రబోధన్ సుభాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న సుభాశ్‌రెడ్డి

దోమ: హిందూ ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) పని చేస్తుందని జిల్లా ప్రబోధన్ సుభాశ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని బొంపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విజయోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి పూర్వ వైభవం తీసుకురావడమే ఆర్‌ఎస్‌ఎస్ అంతిమ లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడ విపత్తులు జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ ముందుంటుందని చెప్పారు. ఖండ బైతిక్ ప్రముఖ్ రవి, ఖండ సహా ప్రముఖ్ రమేశ్ జీ, హిందూ వాహిని జిల్లా పూర్వ ప్రచార ప్రముఖ్ నర్సింహయాదవ్, నేతలు శ్రీనివాస్, మల్లేశ్, నరేశ్, రఘు, సంద సురేశ్, సాయి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, మ్యాడం వెంకటేశం, నర్సింలు పాల్గొన్నారు.

జెడ్పీపీఠం కైవసం చేసుకుంటాం

బీజేపీ జిల్లా కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న బాలేశ్వర్‌గుప్తా

తాండూరు టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంటామని బీజేపీ ఎన్నికల జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి బాలేశ్వర్ గుప్తా అన్నారు. ఆదివారం తాండూరులో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ గుప్తా మాట్లాడుతూ.. పది మండలాల నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారన్నారు. జెడ్పీ చైర్మన్ స్థానానికి ప్రస్తుతం ముగ్గురు అభ్యర్థులు పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. ఆశావహులు దరఖాస్తులు సమర్పిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయి కోర్ కమిటీ పరిశీలించి గెలుపు గుర్రాలనే బరిలో నిలుపుతుందన్నారు. ఈ సమావేశంలో మనోహర్ రావు, శివకుమార్, పటేల్ విజయ్, సాయిరెడ్డి, సుదర్శన్ గౌడ్, వెంకటేశ్, విజయ్, లాలయ్య, జగదీశ్, ఉమేశ్, కృష్ణ, పాల్గొన్నారు.

కక్షపూరితంగా ‘అట్రాసిటీ’

ఇటీవల సంగెం కలాన్‌లో జరిగిన ఇరు వర్గాల ఘర్షణలో బీజేపీ నాయకులపై కక్షపూరితంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు కుట్రపూరితంగా నాయకులపై కేసు పెట్టడం, తదితర పరిణామాలపై సంబంధీకులకు బుద్ధి చెప్పి తీరుతామన్నారు.

కాంగ్రెస్‌ను భూ స్థాపితం చేస్తాం

తాండూరు రూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు ఎన్నికల్లో సంగెంకలాన్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని భూ స్థాపితం చేస్తామని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖపురం ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంగెంకలాన్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ అనుచరులతో కావాలని గొడవలు సృష్టించి అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ ఫ్యామిలీకి గ్రామానికి చెందిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాళ్ల సంజీవ్‌రెడ్డి అంటే భయమని అన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంజీవ్‌రెడ్డి వర్గం పోటీలో ఉంటే తమకు ఓటమి తప్పదని భావించి వారిపై అక్రమంగా అట్రాసిటీ కేసులు నమోదు చేయించి దయ్యబట్టారు. ఎన్నికల సమయంలో కక్షసాధింపు చర్యలకు దూరంగా అక్రమ కేసులు ఉండవని చెప్పిన మనోహర్‌రెడ్డి.. గెలిచిన తర్వాత అనుచరుడు రవిగౌడ్ చేస్తున్న పని ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మనోహ ర్‌రెడ్డి అనుచరుల దౌర్జన్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పండి

మాజీ మంత్రి హరీశ్‌రావు


ప్రజలతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, అభ్యర్థి సునీత

వెంగళరావునగర్: ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని హైలాం కాలనీ, శ్రీకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఆయన ర్యాలీ నిర్వహించి ప్రజలను స్వయంగా కలుసుకుని కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటు వేయడమంటే మన వేలితో మనం పొడుచుకోవడమే అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను, డబ్బును నమ్ముకున్నదేగాని, ప్రజలకు చేసిన వాగ్దానాలను మరచిపోతున్నట్టు చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు డబ్బులకో, మద్యం సీసాలకో అమ్ముడు పోవద్దని సూచించారు. రేవంత్ పంచే డబ్బులు, మద్యం సీసాలను ఎదురించి బీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలని తెలియజేశారు. గత కొన్నేళ్ళుగా ఇక్కడ దివంగత ఎమ్మెల్యే మాగంటి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు 203 గురుకులాలు పెట్టి దేశంలోనే అత్యంతగా గౌరవించింది కేసీఆర్ మాత్రమేనన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ మరిచారని, ప్రజలకు గ్యారంటీ కార్డులు ఇచ్చి మరచిన కాంగ్రెస్‌ను ఓడించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లు ధర తగ్గించాలని ధర్నా


రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

తాండూరు రూరల్: కల్లు ధరను తగ్గించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దేముల్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించారు. వారు మాట్లాడుతూ.. పెద్దేముల్, మంబాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో రెండు రోజులుగా కల్లు దుకాణాలు మూసివేశారన్నారు. గతంలో ఒక్క కల్లు సీసా రూ.10 ఉంటే ప్రస్తుతం రూ.15కు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ఉందని ధర్నా చేస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించడతో వెళ్లిపోయారు.

మైల్వార్‌లో ఇసుక ట్రాక్టర్ సీజ్

బషీరాబాద్: రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైల్వార్ గ్రామానికి చెందిన మున్నూరు శ్యామప్ప అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తలిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు గత కొన్ని రోజులుగా నిఘాపెట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మైల్వార్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుల్స్ పట్టుకున్నారని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఎనిమిది మందికి రిమాండ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూరు రూరల్ సీఐ నగేష్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామంలో ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారన్నారు. ఇందులో ఎరుకుల సంతోష్‌పై కొందరు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇందులో భాగంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాళ్ల సంజీవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రత్నాకర్‌తో పాటు ఆరుగురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

కదిలొచ్చిన గ్రామస్తులు

సంగెంకలాన్ గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో ఒక్కసారిగా రాజకీయ రంగు పుసుకుంది. ఇరు పార్టీల నేతలు పెద్ద ఎత్తున ఆదివారం రాత్రి కోర్టు వద్దకు తరలివచ్చారు. అదేవిధంగా గ్రామంలో ఎనిమిది మంది రిమాండ్‌కు వెళ్తున్నారని తెలిసి లారీలో ఊరంతా కదిలి వచ్చి వారికి సానుభూతి ప్రకటించారు.

సినీ నటిపై దాడి.. యువకుడిపై కేసు

బంజారాహిల్స్: తన అపార్ట్‌మెంట్ ముందు పార్కింగ్ స్థలంలో ఓ వ్యక్తి బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండగా ఇదేమిటని అడిగినందుకు ఆ యువకుడు కోపంతో సినీనటితో పాటు ఆమె పీఏపై దాడి చేసి గాయపర్చిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిగూడలో నివసించే సినీ నటి ఈ నెల 1వ తేదీన దైవ దర్శనం చేసుకుని ఇంటికి వస్తుండగా అపార్ట్‌మెంట్ ముందు పార్కింగ్ స్థలంలో దేవేందర్ అనే వ్యక్తి మూత్ర విసర్జన చేస్తున్నాడు. దీంతో నటి పీఏ బయటకు వచ్చి దేవేందర్‌ను ఇదేమి పద్ధతి అని నిలదీశాడు. దీంతో దేవేందర్ ఆగ్రహంతో ఊగిపోతూ మరో ఇద్దరు మహిళలతో కలిసి న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ దాడికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో దేవేందర్ ఘటనకు పాల్పడ్డాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం


విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

దుద్యాల్: క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పది రోజులుగా కొనసాగిన దసరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన 11 స్టార్ జట్టుకు ఆదివారం ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా క్రీడలు ఆడాలన్నారు. గ్రామాల్లో నిత్యం సమయానుకూలంగా ప్రతిఒక్కరు ఏదో ఒక ఆటను ఆడాలని సూచించారు. కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నిర్వాహకులు నరేందర్‌గౌడ్, సంతోష్, అనిల్, విష్ణువర్ధన్, గ్రామస్తులు శ్రీకాంత్, నిసార్, ఫరీద్, రాజేశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన సరదా

చెరువులో నీట మునిగి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి


సునీల్ (ఫైల్)

యాలాల: దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చిన ఓ పాలిటెక్నిక్ విద్యార్థి సరదాగా ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన యాలాల మండలం ముకుందాపూర్‌తండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రతన్‌నాయక్, బాలిబాయి దంపతుల కొడుకు సునీల్(17) సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడు ఎప్పటిలాగే దసరా పండుగకు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. తోటి స్నేహితులతో కలిసి సరదాగా గ్రామ శివారులోని ముద్దాయి చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. చెరువులో ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు ఈత కొడుతుండగా మధ్యలో అలసిపోయి నీటమునిగాడు. గమనించిన మిత్రులు ఈ విషయాన్ని తండావాసులకు చెప్పడంతో చెరువులో గాలించి సునీల్ మృతదేహాన్ని వెలికితీశారు. పండగకు వచ్చిన కొడుకు అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో విద్యుత్ టవరెక్కి హల్‌చల్

మైలార్‌దేవ్‌పల్లి/జవహర్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ వాంబే కాలనీకి చెందిన ఇంజమూరి వేణు రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఆదివారం ఉదయం ఇతను పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఇంటి పక్కనే ఉన్న మల్లారెడ్డి, శిరీష అనే ఇద్దరు తనను కొట్టారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేయగా...తన ఇంటి పక్కనే ఉన్న వారికి వేణు గతంలో డబ్బులు ఇచ్చాడని, ఆ డబ్బులు ఇవ్వమని మద్యం మత్తులో వెళ్లి అడుగగా వారు అతన్ని బెదిరించి పంపించారని తేలింది. ఈ క్రమంలోనే వేణు తను అప్పుగా ఇచ్చిన రూ.1500 ఇవ్వడం లేదని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. మద్యం మత్తులో పోలీసులను కూడా ఇబ్బంది పెట్టడంతో వారు నచ్చజెప్పి పక్కన కూర్చోబెట్టారు. ఇంతలోనే వేణు బయటకు వెళ్లి తనకు న్యాయం జరగడం లేదంటూ పోలీస్ స్టేషన్ ముందు ఉన్న 33 కేవీ హైటెన్షన్ పోల్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి కరెంటు సరఫరా నిలిపివేయించారు. అనంతరం ఘటన స్థలికి చేరుకున్న రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మక్బూద్, ఎస్ఐలు పైడినాయుడు, విశ్వనాథ్‌రెడ్డి, డీఆర్ఎఫ్ బృందాలు కలిసి పైకి ఎక్కిన వేణును బుజ్జగించి కిందకి దింపారు. అతన్ని వైద్యం నిమిత్తం ఆస్పత్రికి చేర్చారు. ఈ ఘటనతో దుర్గానగర్ నుంచి చంద్రాయణ గుట్ట వెళ్లే రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది.

జవహర్‌నగర్‌లో...

జవహర్‌నగర్ వికలాంగుల కాలనీలోనూ ఓ వ్యక్తి విద్యుత్ టవర్ ఎక్కి హంగామా సృష్టించాడు. పోలీసులు తెల్పిన మేరకు వెంకటేష్, లక్ష్మి దంపతులు కాగా ముగ్గురు పిల్లలతో కలిసి వికలాంగుల కాలనీలో ఉంటున్నారు. వెంకటేష్ మద్యానికి బానిసై ప్రతిరోజు భార్యను వేధింపులకు గురిచేసేవాడు. శనివారం భార్యా భర్తల మధ్య గొడవ పెద్దగా అవడంతో భార్య లక్ష్మి చేతులను విరగొట్టాడు. దీంతో లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తనని కొడతారనే భయంతో విద్యుత్ టవర్ ఎక్కి చనిపోతానంటూ బెదిరింపులకు దిగాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని వెంకటేష్‌ని కిందికి దించారు. అయితే వెంకటేష్ గతంలో కొన్నిసార్లు చనిపోతానంటూ ఆత్మహత్యాయత్నం చేశారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వారం రోజులుగా నీటి ఎద్దడి


పొలంలో నుంచి నీటిని తెచ్చుకుంటున్న తండావాసులు

దౌల్తాబాద్: మండలంలోని బిచ్యాల తండాలో గత వారం రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో ఉన్న మిషన్‌భగీరథ పైప్‌లైన్ పగలడంతో నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో తండావాసులు వారం రోజులుగా సమీప పొలాల్లో నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అయితే ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి మునిరొద్దీన్‌కు సైతం విన్నవించారు. వారం రోజులుగా సమస్యను పరిష్కరించడంలేదని తండావాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. రెండు రోజుల్లో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు.



జొన్న కంకికి జాబిలమ్మ కాసినట్టు

‘ఓవైపు వేప చెట్టు, మరో వైపు చింత చెట్టు, నట్టనడుమ తెలంగాణ తల్లి చేతిలో ఉండే జొన్నకంకి, దానిపై పున్నమి వెలుగులు’ ఇలా చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది కదూ. ఈ కమనీయ చిత్రం ఆదివారం రాత్రి మండల పరిధిలోని రేగడిమైలారంలో చూపరులను ఆకట్టుకుంది. – బొంరాస్‌పేట

దైవ దర్శనానికి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం

- కొందుర్గుకు చెందిన బాలిక మృతి


నిహారిక (ఫైల్)


ప్రమాదంలో గాయపడిన అనిత

కొందుర్గు: దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మృత్యువాత పడిన ఘటన స్థానికంగా కలచి వేసింది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కొందుర్గు గ్రామానికి చెందిన దోరపల్లి అనిత తన కూతురు నిహారిక(13), కుమారుడు విఘ్నేష్‌తో కలిసి నందిగామకు చెందిన తమ బంధువు శ్రీను కుటుంబ సభ్యులతో శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం కారులో బయలుదేరారు. మార్గమధ్యలో హైదరాబాద్‌లోని ఘట్కేసర్ ఔటర్ రింగ్ రోడ్డుపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నిహారికకు తీవ్ర గాయాలు కాగా విఘ్నేష్‌కు కాలు విరగడంతోపాటు అనితకు గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు క్షతగాత్రులను నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. నిహారిక పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి బాలిక మృతి చెందింది. మృతురాలు కొందుర్గు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. గాయాలైన అనిత, విఘ్నేష్‌లు ఆసుపత్రి నుంచి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దైవ దర్శనానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం


మీర్‌ఖాన్‌పేటలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. పీఎస్ పరిధిలోని మీర్‌ఖాన్‌పేట గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. పండుగల సందర్భంగా ప్రజలు విలువైన వస్తువులు, బంగారు నగలను ఇంట్లో ఉంచి వెళ్లరాదని సూచించారు. కొత్త వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలని చెప్పారు. మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి వారికి బానిస కావద్దన్నారు. వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ వంశీ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాండియా ఆడుతున్న యువకుడిపై దాడి

నలుగురు నిందితులపై కేసు నమోదు

బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో దాండియా ఆడుతున్న యువకుడిపై నలుగురు వ్యక్తులు అకారణంగా దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు బాధిత విద్యార్థి పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే..లంగర్‌హౌజ్‌కు చెందిన ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి (25) దాండియా కోసం తన స్నేహితులతో కలిసి కల్చరల్ ఈవెంట్ టికెట్ బుక్ చేసుకున్నాడు. రాత్రి 10.15 గంటల సమయంలో బాధిత విద్యార్థితో పాటు అతని స్నేహితులు దాండియా నృత్యం చేస్తుండగా ఓ గ్రూపు వీరి వద్దకు వచ్చి అడ్డంగా నిలబడ్డారు. నీ పేరు ఏమిటంటూ సదరు విద్యార్థిని అడగడమే కాకుండా అకారణంగా పిడిగుద్దులతో బాదారు. బాధితుడు వెంటనే వారి బారి నుంచి తప్పించుకుని బయటకు పరుగులు తీసి నేరుగా పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై దాడి చేసిన వారిలో లక్ష్మణ్, దీపక్, భరత్, చంద్రకాంత్‌లను గుర్తుపట్టానని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. పంజగుట్ట పోలీసులు నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్ 189(2), 329 (4), 115 (2), 3 (5) కింద కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా ఇక్కడ సీసీ ఫుటేజీలు పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా దాడి చేసిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారికి చిత్రహింసలు

తల్లి, సవతి తండ్రిపై కేసు నమోదు


గాయాలతో చిన్నారి

మియాపూర్: ఓ చిన్నారిని చిత్రహింసలకు గురిచేసిన కన్నతల్లితో పాటు సవతి తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల మేరకు హాఫీజ్‌పేటలో నివాసం ఉంటున్న షబా నజ్నీన్, ముషీరాబాద్‌కు చెందిన తాజుద్దీన్ అనే వ్యక్తిని 2020లో వివాహం చేసుకుంది. వీరికి నాలుగు, రెండు సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో ఆరు నెలల క్రితం షబా నజ్నీన్ భర్తతో విడాకులు తీసుకుంది. ఈ క్రమంలో గత రెండు నెలల కిందట జోగిపేటకు చెందిన మహమ్మద్ జావిద్‌ను రెండో పెళ్లి చేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి హాఫీజ్‌పేటలో నివాసముంటుంది. మహమ్మద్ జావిద్ ఆటో నడుపుతుండగా షబా నజ్నీన్ ఇంటి వద్దే ఉంటుంది. గత కొంతకాలంగా షబా నజ్నీన్ తన నాలుగేళ్ల పెద్ద కుమార్తెను కొడుతూ తిడుతూ చిత్రహింసలకు గురి చేస్తోంది. తన రెండో భర్తతో కలిసి చిన్నారికి వాతలు పెట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఈ నెల 1న చిన్నారి ఇంటి నుంచి బయటకు రాగా కాలిన గాయాలు చూసి స్థానికులు ప్రశ్నించగా తన తల్లి, సవతి తండ్రి కొట్టారని, వాతలు పెట్టారని చిన్నారి తెల్పడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని పోలీసులకు తెల్పడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాలికకు చిత్ర హింసలు నిజమని తేలడంతో షబా నజ్నీన్‌తో పాటు సవతి తండ్రి మహమ్మద్ జావిద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారులను వసతిగృహానికి తరలించి.. అక్కడి నుంచి స్వంత తండ్రి తాజుద్దీన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.